# సగం ప్రజాస్వామ్యం

ఆచార్య కొలకలూరి ఇనాక్

'నా ఓటు నేను వేసి తీరాలి!'

'వేయండి!'

'నాకు పోస్టల్ బేలెట్ ఇవ్వాలి!'

'ఇవ్వటానికి వీలు లేదు.'

ఈ సంభాషణ రవికీ, అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల అధికారికీ మధ్య జరిగింది.

'ఓటు హక్కు కాదు, బాధ్యత. పవిత్రమైన, రాజ్యాంగబద్ధమైన, నైతికమైన ధార్మికమైన బాధ్యత'-ఇది రవి విశ్వాసం

రాష్ట్రపతి, జాతిప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మాటలే చెప్పాడు.


రవి కూడా, తన విద్యార్థులకు, బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు ఈ మాట యాభై ఏళ్లుగా చెబుతూ వచ్చాడు. చెప్పటమే కాదు, ఆచరించేవాడు. ఆచరింపచేసేవాడు. భార్యనూ, పిల్లలనూ వెంట తీసుకొనిపోయితాను ఓటు వేసి, వాళ్లు తమ బాధ్యత నెరవేర్చగా ఇంటికి తీసుకువచ్చేవాడు. పిల్లలు పెళ్లిళ్లయి, ఉద్యోగాలు వచ్చి వేరే ఊళ్లకు వెళ్లిపోయినా, ఎన్నికలకు ముందు రోజు ఫోన్లు చేసి ఓటు వేయటం మరిచి పోవద్దని చెప్పటం ఆనవాయితీ గా చేసుకున్నాడు.

తనకు ఎలెక్షన్ డ్యూటీ ఉంటే పోస్టల్ బేలెట్ తీసుకొని ఓటు వేసి తీరేవాడు. అటువంటిది ఇప్పుడు పోస్టల్ బేలెట్ ఇచ్చే అవకాశం లేదంటున్నాడు, అధికారి. ఇవ్వాలని పట్టుదలగా అడుగుతున్నాడు రవి.

రవి వి.సి.గా పదవీవిరమణ చేశాడు. బాధ్యత తెలిసిన మనిషి. అనంతపురంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నిక జరుగుతున్న రోజే, న్యూ ఢిల్లీలో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన విదేశాంగశాఖ సలహా మండలి సమావేశం ఉంది. అది ఎన్నికల తేదీ ప్రకటించక ముందే నిర్ణయింపబడింది. ఆ మీటింగ్‌లో పాల్గొంటానని తాను అంగీకారం తెలిపాడు. ఇప్పుడీ ఎన్నికలు వచ్చాయి.

అనంతపురంలో ఉదయమే ఓటు వేసినా, పదకొండు గంటలకు న్యూ ఢిల్లీలో సమావేశానికి హాజరు కాలేదు. ఏ ప్రయాణమూ వీలు లేదు. పదిమంది సభ్యులతో పని కాబట్టి, దాని తేదీ మారదు. ఎన్నికల తేదీ మారదు. ఓటు బాధ్యత నిర్వహింపదలిస్తే, కమిటీ బాధ్యత నిర్వహించలేదు. దాని ప్రాధాన్యం దానికుంది.

ఇంత మంది ఓటు బాధ్యత నిర్వహిస్తారు. కాబట్టి తాను ఓటు వేయకపోయినా పరవాలేదని రవి అనుకోలేదు. కమిటీ మిగతా సభ్యులు నిర్ణయం తీసుకొంటారు. తాను తన సూచనలు చెప్పకపోయినా జరిగిపోతుందని ఊరుకోలేదు. అందుకోసం పోస్టల్ బేలెట్ అడిగాడు అది ఇస్తే ఓటు వేయవచ్చు. సమావేశంలో పాల్గొననూ వచ్చు. రెండు బాధ్యతలూ నిర్వహించవచ్చు.



ఎలెక్షన్ డ్యూటీ ఉన్న ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బేలెట్ ఇస్తారు కానీ, మరెవ్వరికీ ఆ అవకాశం లేదు. ఇప్పుడు రవి ఉద్యోగి కాకపోయినా, ఎలెక్షన్ డ్యూటీ కంటే పెద్ద బాధ్యత నెరవేరుస్తున్నాడు కాబట్టి, పోస్టల్ బేలెట్ కావాలంటున్నాడు.

ఎన్నికల అధికారి తన పరిధి వివరించి, తన నిర్ణయం ప్రత్యేకంగా ఉండదని, తన ప్రమేయానికి అవకాశం లేదని స్పష్టంచేశాడు.

ఈ పరిస్థితుల్లో ఈ రెండింటిల్లో ఏ ఒక్కటో చేయగలడు రవి. రెండూ చేయటం సాధ్యం కాదు. ఓటు వేయటమా, మీటింగుకు హాజరు కావటమా ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి.

పోస్టల్ బేలెట్ ఉంటే రెండూ సాధ్యమే! లేకపోతే ఏదో ఒకటే సాధ్యం. ఏదో ఒకటి అనుకుంటే ఆలోచించే అవసరమే లేదు. ఆరాటమూ అక్కరలేదు. తాపత్రయమూ లేదు. రవి మనస్సు చికాకుగా ఉంది. అయినా ప్రయత్నం మానలేదు.

జిల్లా ఎన్నికల ప్రధానాధికారి కలెక్టర్. కలెక్టర్ ప్రమేయంతో తాను ఓటు వేసే పరిస్థితి ఉంటుందేమోనని ప్రయత్నించటంలో భాగంగా రవి కలెక్టర్‌కు ఫోను చేశాడు.

రోజంతా పనిలో తలమునకలై, అలిసి ఉన్నా కలెక్టర్ చెప్పిన మాట శ్రద్ధగా వింది. ఓర్పుగా ఆలోచించింది.

"ఈ రెండు బాధ్యతల్ని నేను హక్కులుగా భావిస్తున్నాను. ఏ హక్కునూ వదులుకోదలచలేదు. అవకాశం పరిశీలించండి" అని రవి కోరాడు.

"పౌరధర్మం నిర్వహించటానికి, దేశావసరం తీర్చటానికి సంసిద్ధులైన మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను" అంది కలెక్టర్.

జిల్లా కలెక్టర్లు స్త్రీలు అయితే, పరిపాలన ఎంత ఓర్పుగానో, ఆదరంగానో ఉంటుదని రవి వ్యాఖ్యానించాడు.

'మీరు అన్నీ తెలిసిన పెద్దలు' అంది. ఆగింది. 'కొన్ని నియమాలకు లోబడి మేము పని చేయవలసి ఉంటుందనీ మీకు తెలుసు' ఆగింది, దగ్గింది. 'నేనేమీ చేయలేను. మీరే మీ నిర్ణయం తీసుకోవాలి. అది కష్టంగానే ఉంటుంది. ఏదో ఒకటి మీరు చేయగలరు. పోస్టల్ బేలెట్ ఎలెక్షన్ డ్యూటీ ఉన్న ఉద్యోగులకు తప్ప మరెవ్వరికీ ఇచ్చే అవకాశం లేదు. రాష్ట్రపతి అయినా బూత్‌కు వచ్చి ఓటు వేయవలసిందే. పోస్టల్ బేలెట్ లేదు. సెక్యూరిటీ ప్రమాదమున్నా ప్రధాన మంత్రి అయినా బూత్‌కు వచ్చి ఓటు వయవలసిందే!. వాళ్లకూ ఎన్నో పనులుంటాయి. కదా! అయినా పోస్టల్ బేలెట్ వాళ్లకు కూడా ఇచ్చే వీలు లేదు. మీకు తెలియంది ఏముంది? నేనేం చేయలేను."

రవి ఆమె నియమపాలన దృష్టిని అంగీకరిస్తూ, 'ఉన్న స్థితిని కాదు, ఉండవలసిన స్థితిని గురించి నేనడుగుతున్నాను. రెండు బాధ్యతలను నిర్వహించే అవకాశం నాకు కలిగించే పరిస్థితిని గూర్చి ఆలోచించమనటానికి ఫోన్ చేశాను.'

'మీకు తెలుసు నేనేమీ చేయలేను.'

'సరే! మీరు రోజంతా పని చేసి అలసిపోయి కూడా నా అవసరం

[illegible] ఆలోచించి ఓర్పుగానూ, నేర్పుగానూ బదులు చెప్పినందుకు థాంక్స్!' అంటే, 'మీకు థాంక్స్ చెప్పాలి సార్ నేను. ఇటువంటి పరిస్థితుల్లో ఏం చేయాలి అని ఆలోచించి ప్రభుత్వానికి వ్రాసి, పరిశీలించి, తగు నిర్ణయం తీసుకోమని చెప్పె అవకాశం మీరు నాకు ఇచ్చినందుకు మీకు థాంక్స్' అంది.

రవి ఆలోచన అంతటితో ఆగలేదు.


భర్తతో మాత్రమే బైటికి వచ్చే స్త్రీ భర్త లేకుండా పోలింగు బూతుకు వచ్చి ఓటు వేయాలి.

పచ్చి బాలింతరాలు, పండుముసలి, అంగవికలురు, కాటికి కాళ్లు చాపినవాళ్లు అయినా ఓటు వేయాలంటే పోలింగు బూతుకు రావాలి. మార్గాంతరం లేదా? ప్రత్యామ్నాయం లేదా? రవి అశాంతిగా ఉన్నాడు.

పెళ్లి, చావు, పితృకార్యం, అనారోగ్యం, డెలివరీ, హాస్పిటల్లో వైద్యం, ఆపరేషన్, పరీక్ష, దూరనివాసం వంటి సవాలక్ష సందర్భాలలో ఓటు వేసే అవకాశం లేకపోవడం వల్ల, ఓట్లు మరుగున పడిపోవాలా?

తెలిసి వచ్చే తొందరలు, తెలియక వచ్చే ఆటంకాలు ఈ బాధ్యతను వ్యర్థం చేస్తాయా? మరో మార్గం ఉండవద్దా?

ఏ కారణం వల్లనైనా పోలింగు బూతుకు వచ్చి ఓటు వేయలేకపోయేవాళ్లు, ఓటు వేసే బాధ్యత నిర్వహించడానికి ఏదో ఏర్పాటు ఉండి తీరాలి. ఇంత వరకూ ఆ ఏర్పాటు లేదు. ఇక ముందు కూడా ఆ ఏర్పాటు లేకుండా పోకూడదు.



ఓటర్ల లిస్టులో పేర్లున్నవాళ్లు, అర్హులైన అందరి పేర్లూ లిస్టులోకి రావాలి. చనిపోయినవాళ్లు మినహా, అందరూ ఓట్లు వేసే వ్యవస్థ ఏర్పాడాలి. నూటికి యాభై ఓట్లే పోలు కావడం కాదు. నూరు శాతం పోలు కావాలి.

మీరు ఓట్లు వేస్తే ఎంత, వేయకపోతే ఎంత-అనే దృష్టి ప్రజలకు, నాయకులకు, ప్రభుత్వాలకు ఉండకూడదు.

ఇరవై శాతం ఓట్లు పోలైనా పరవాలేదు. మెజారిటీ వచ్చినవాడు గెలుస్తాడు. అనే నిర్లక్ష్యం ఉండరాదు. అందరి ఓట్లు పోలు కావాలని ఆశ, ఆసక్తి ఉండి తీరాలి. పోలింగు బూతును మించిన పోలింగు విధానం ఏర్పడటం, ప్రజాస్వామ్యం దృష్టిలో అనివార్యం.

ఈ దృష్టితోనే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని రవి కలిశాడు.

అధికారి అలిసిపోయి ఉన్నాడు. రవి రావడం అలుపు తీర్చుకునే మార్గంగా భావించాడు.

'అందరూ ఓట్లు వేసే అవకాశం ఉండాలి. నేను నా ఓటు వేయాలి.'

'వీలు లేదు కదా! పరవాలేదు మాస్టారూ, ఎవరో ఒకరు వేస్తారు.'

రవి బాధ కలిగింది. 'దొంగ ఓటా?'

'పోనీలెద్దురూ! సద్వినియోగం అవుతుంది కదా!'

'సద్వినియోగమా? కాదు కదా! దుర్వినియోగం. నా ఓటు మరొకరు వేయటం మోసం, నేరం!'

'నిజమే. జరుగుతున్నదదే, ఏం చేస్తాం? మీ ఓటు మురిగిపోదు లెండి!'

'మురిగిపోయినా, నేను వేయదలచిన క్యాండిడేట్‌కు కాకుండా మరొకరికి ఓటు పడే కంటే మురిగిపోవడమే కానీ ఓటు మురిగిపోవటం నాకిష్టం లేదు. పైగా అక్రమం జరుగుతుందని మీరు అంగీకరించటం నాకు బాధగా ఉంది.'

'నిజమే, సరదాకి అంటున్నాను కానీ, మాస్టారూ, మీకు, మీ వంటి ఓటర్లకు చాలా సందర్భాల్లో, అవసరకాలంలో, పోస్టల్ బేలెట్ ఇస్తే సద్వినియోగం అవుతాయా? దుర్వినియోగం కావా?'

'దుర్వినియోగమంటే?'

'ఏవో ప్రలోభాలకు లొంగి కొనే అభ్యర్థికి ఓటు అమ్మేయటం జరగదా?'

చాలా బాధతో, 'నేను నా ఓటు అమ్ముకొంటానని మీరు భావిస్తున్నారా?' అన్నాడు రవి.

'మీ విషయం కాదు మాస్టారూ. ఎవరైనా తన ఓటు అమ్ముకోవచ్చు కదా!'

'నిజమే! ఓటు అమ్మటం తప్పే, కొనటమూ తప్పే. ఎవరికీ శిక్ష లేదు.'

కానీ బాహాటంగా కొనుగోళ్లు అమ్మకాలు జరగవు కదా! అంతా లోపాయికారీ వ్యవహారం. డబ్బు తీసుకొని ఓటరు తన ఓటు వేరే అభ్యర్థికి వేసే అవకాశం ఉంది. పోస్టల్ బేలెట్‌లో ఆ అవకాశం లేదు. పోస్టల్ బేలెట్ అమ్ముకోవటం విన్నారు కదా!'

'చదివాను!'

'ఇటువంటి సందర్భాలలో పోస్టల్ బేలెట్ అనైతికచర్యను ప్రోత్సహించటమే కాదా?'

'అందరూ అమ్ముకోరు!'

అధికారి బాధ్యతయుతంగా ఉన్నాడని రవి ఆనందించాడు. 'ఎవరు ఓటు అమ్ముకొంటారో, ఎవరు కొంటారో, ఎలా తెలుస్తుంది? తెలిస్తే మాత్రం ఏం చేయటం?'

'ఓట్ల వ్యాపారం మొదలైతే ఏ ఓటు అయినా అమ్ముడుపోతుంది. అమ్మటమే నేరం. ఓటు అమ్మేది ఒకరికి, వేసేది మరొకరికి అయితే మరో ద్రోహం! నేరమే అసహ్యం, ద్రోహం నైతికపతనం, నేరమూ ప్రోత్సహించరాదు. ద్రోహమూ సహించరాదు.'

'పోస్టల్ బేలెట్ దగ్గరుండి ఇవ్వకపోతే, అమ్మకపోతే దొంగతనం జరగవచ్చు. ప్రాణహాని కలగవచ్చు.

'అది ఊహ మాత్రమే! కానీ అవకాశం లేకపోలేదు. నీతిమంతులకూ, అవినీతిపరులకూ పోలింగు బూతే మేలంటారు!.

'కాదా మరి?' మంచో చెడో, తప్పో ఒప్పో, పోలింగు బూతుతో చెల్లు! కొత్త చెత్త నెత్తికెత్తుకొనే పని లేదు.

'అంటే మీరు పాత దుర్వినియోగం కొనసాగిస్తూ కొత్త దుర్వినియోగం నివారిస్తామంటారు? అంతేనా?'

'కొత్త సమస్యలు వద్దు కదా!'

'తాగించి ఓట్లు కొంటున్నారు. డబ్బులిచ్చి కొంటున్నారు. గుడి, బడి, రోడ్డు, నీళ్ల ట్యాంకులకు డబ్బు ఇచ్చి పల్లె ఓట్లు ఊరి ఓట్లు కొంటున్నారు. బొట్టు కాటుక, చీర జాకెట్టు, బిందె, బక్కెట్ ఏవేవో ఇచ్చి ఓట్లు కొంటున్నారు. ఇళ్ల స్థలమో ఇల్లో, గొర్రో, బర్రో ఇస్తున్నారు. ఓట్లు కొంటున్నారు. భూమి పుత్రా, తాగు నీరు, సాగు నీరు దిక్కుమాలినన్ని దివాలాకోరు పనులు చేస్తున్నారు. ఇవేవీ నేరాలు కావా? దేశద్రోహం కావా? దేశద్రోహులు నాయకులైతే దేశాన్ని పరిపాలించాలా? దేశాన్ని అమ్మకం పెట్టాలా? అమ్ముకుతినాలా? దీన్ని మనమే ప్రోత్సహిస్తున్నాం?'

'ఇవి అరికట్టవలసినవే!'

'ఇన్ని ఘోరాల మధ్య సగం మందే ఓట్లు వేస్తున్నారు. అందరూ ఓట్లు వేసే అవకాశం మంచిది.'

'తలనొప్పులూ పెరుగుతాయి!'


'తలనొప్పులు వస్తున్నాయని ఎన్నికలు ఆపలేం కదా, ఆపలేదు కదా!' అలాగ్గే ఎన్నికల తలనొప్పులైనా భరించి నూటికి నూరు శాతం ఓట్లు పోలయ్యేటట్టు చూడటం శ్రేయం కదా!'



దాదాపు ఒకటిన్నర శతాబ్దం కిందట వెలసిన గణపతి ఆలయం, సికిందరాబాద్ రైలు స్టేషన్ సమీపంలో వున్నది. ఒక పాత బావిని మంచి నీటి కోసం బాగు చేసినప్పుడు అందులో గణపతి విగ్రహం లభించిందనీ, ఆయననే ప్రతిష్ఠించి, ఈ ఆలయం నిర్మించారనీ చెబుతారు. ఈ స్వామికి నిత్యోత్సవాలూ, పండుగ రోజుల్లో ప్రత్యేకోత్సవాలూ

## సికిందరాబాద్ గణపతి

జరుగుతాయి. ఇందులో ఇతరదేవతలకు సంబంధించిన ఆలయాలన్నీ వుండటం విశేషం. దేవతల దర్శనార్థం, మరో చోటికి పోకుండా, అందరినీ ఒకటే చోట దర్శించుకోవటం భక్తులకు ముదావహం.



దండకారణ్యంలోని ఈ చోట వున్న గణపతిని, పరమశివుడు స్వయంగా ప్రతిష్ఠించాడట. గర్భాలయంలో స్వామి పక్కన సిద్ధిబుద్ధులు వుంటారు. పది తొండాలూ, 20 చేతులూ వున్న ఇక్కడి వినాయక విగ్రహాన్ని, మహమ్మదీయుల దండయాత్రల్లో దాచేశారట. ఈయనను 'మహోత్కటగణపతి' అంటారు. ఈ క్షేత్రంలో అంగారసంబంధఅక్షరలు వుండటం వల్ల, ఈ స్వామిదర్శనమాత్రం చేత గుండె పోటు, రక్తపుపోటు వంటి జబ్బులు నయమవుతాయట.

## రంజన్‌గావ్ గణేశుడు

**గమనిక : 23-8-06 సంచికలో ప్రచురితమైన 'తారుమారు' కథ రచయిత్రి కె. వాసవదత్త రమణ.**

'మంచిదే కాని—అసాధ్యం!'

'పూర్తి శాతం జనం ఓట్లు వేయటానికి ఎన్ని ఏర్పాట్లు అయినా చేయవచ్చు. ఎంత ఖర్చయినా పెట్టవచ్చు. ఎంత మందీ మార్బలం అయినా నియమించవచ్చు. అందరూ ఓట్లు వేసే పరిస్థితి ఉంటే అవినీతి తగ్గుతుంది.'

'కాదు! పెరుగుతుంది!'

'ప్రయత్నించకుండానే పెరుగుతుందంటే బాధ్యతారాహిత్యమే. అలా అనకూడదు.'

'పోలింగ్ బూత్‌లో జరిగే ప్రమాదమే పోస్టల్ బేలెట్‌లోనూ జరుగుతుంది.'

'కావచ్చు, అక్కడ యాభై మంది ఓటు వేయగా, ఇక్కడ నూరు మంది దాకా ఓటు వేస్తారు!

'మంచో, చెడో, కీడో, మేలో, రెట్టింపు అవుతుంది,'

'ఏ సందర్భంలో నైనా, ఏ పరిస్థితుల్లోనైనా ఓటరు తన ఓటు బాధ్యత నిర్వహించే అవకాశం ఉండాలి.'

'మేలే!' అధికారి అంగీకరించాడు. అటెండరు కాఫీ రెండు కప్పుల్లో తెచ్చాడు.. అంటూ అధికారి కాఫీ చప్పరిస్తున్నాడు. రవి మంచి నీళ్లు తాగాడు.

'కొందరి ఓట్లు కొంటారు. కొందరిని ఓట్లు వేయటానికి రానీరు. కొడతారు, చంపుతారు. కొందరికి ఓట్లు లేకుండా చేస్తారు. ఎదురు మాట్లాడితే మన ప్రాణ హాని తలపెడతారు. ఆస్తులు నాశనం చేస్తారు. ఇన్ని ప్రలోభాల మధ్య అందం కూడ ప్రవేశించింది. అందగాళ్లను, అందగత్తెలను, సినిమాయాలోకం నుంచి దించుతున్నారు. ఆకర్షణ ప్రలోభం ప్రవేశించింది. నిశ్శబ్దప్రచారం ఉండదా? శబ్దకాలుష్యం తగ్గదా? ధనం దౌర్జన్యం పోదా? కులం, మతం కుళ్లు కంపుపోదా? కొట్లాటలు, హింసలు, మానభంగాలు, ప్రాణహానులు ఆగవా? దుర్మార్గులు రాజ్యమేలాలా? దుర్మార్గులుగా జనం మారాలా? దుర్మార్గంలో ప్రజాజీవనం కొనసాగాలా?'

'మాస్టారూ! నన్ను మన్నించాలి. నేను వీటికి వేటికీ బదులు చెప్పలేను, కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను! ఓటరు స్థాయి పెరగాలి.'

'ఓటరు స్థాయి పెరగాలంటే ఆర్థిక దుస్థితి తొలగాలి. తొలగనివ్వం. వాళ్లకు ఏమీ లేకుండా ఉండాలి. అన్నం, బట్ట, గుడిసె ఇస్తూనే ఉండాలి. కొరత తీరకూడదు. కులం, మతం, బ్రాందీ, గుడి, మత్తు ఎక్కిస్తూనే ఉండాలి. వాళ్లా మత్తులో పడి కొట్టుకొంటూ ఉండాలి. నీళ్లలా డబ్బు ఖర్చు చేసి గెలవాలి. దానికి పదిరెట్లు సంపాదించాలి. దేశాన్ని దోచుకోవాలి. అమ్ముకోవాలి. జనం ఏమనుకుంటారన్న సిగ్గు లేకుండా డబ్బు సంపాదించాలి. అందులో ఏదో వంతు ఖర్చుచేసి మళ్లీ గెలవాలి. మళ్లీ దోపిడీ! ప్రజల్ని చైతన్యవంతుల్ని కానిచ్చే పరిస్థితే లేదు. దారిద్ర్యం తొలగే స్థితి లేదు. ఓటరు స్థాయి పెరగక్కుండా ఎంతో జాగ్రత్త పడాలో అంత జాగ్రత్త పడతారు. వీళ్లు ఇన్ని ప్రజాప్రభుత్వాలు, ఇన్ని ప్రణాళికలు, ఇన్ని ప్రభుత్వాలు ఏంచేశాయి? పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. పేదరికం నిర్మూలించే ప్రజాస్వామ్యం రావాలి.'

'ప్రజాస్వామ్యం, పేదరికం ఒకదాని పునాది మీద మరొకటి మొలుస్తున్నాయి. ప్రజాస్వామ్యం పేదరికాన్ని నిర్మూలిస్తుందా? నిర్మూలింపబడ్డా పేదరికం—సర్వసమానసంపన్నజనం—సక్రమ ప్రజాస్వామ్యం నెలకొల్పుతారా? ఏది ముందు? ఏది వెనుక? ఏది సాధనా? ఏది ఆసాధ్యం? మాస్టారూ! ఏదీ ఆలోచనకు .....

'ఈ ప్రజాస్వామ్యం ఎన్నికల్లో సగం ఓట్లే పోలవుతున్నాయి. మిగతా సగం వ్యర్థం. ఇక ప్రజాస్వామ్యం సంపూర్ణంగా సంక్షేమంగా సర్వసమర్థంగా ఎప్పుడు రూపొందుతుంది?'

అధికారి తల పట్టుకొని కూర్చున్నాడు.

'ఈ సగం ఓట్లలో బహుముఖ పోటీ వల్ల సగం కూడా రానివాడు గెలుస్తాడు. అటువంటివాళ్లు కొందరు కలసి పరిపాలిస్తారు. కొందరు ప్రతిపక్షం అవుతారు. నూటికి పది పాతిక మందికి కూడ ప్రాతినిధ్యం వహించలేనివాళ్లు పాలకులవుతున్నారు. ఎంత దుర్మార్గం?!

'ఇది ప్రజాస్వామ్యం మాస్టారూ!'

'ఈ ప్రజాస్వామ్యం పకడ్బందీగా రూపొందాలి.'

'అంటే?'

'వీలైనంత ఎక్కువ మంది ఓటును బాధ్యతగా, హక్కుగా వినియోగించుకొనే పరిస్థితి ఉండాలి.'

'అంటే విరివిగా పోస్టల్ బేలెట్ ఇచ్చే పరిస్థితి ఉండాలంటారు?'

'స్పష్టంగా చెప్పారు మీరు.'

అధికారి తల పట్టుకొని కూర్చున్నాడు.

రవి ఆవేశంతో ఊగిపోతున్నాడు. 'తల పగిలే పనులు చాలా ఉన్నాయి. మీరు రాగానే కాస్త అలుపు తీరుతుందనుకొన్నాను. మీరు నన్ను మరింత అలసిపోయేట్టుచేశారు.!'

'ఆలోచింప చేయాలని—'

'అదే చేస్తున్నాను— ఈ వయస్సులో మీరింతగా ఉద్రేకపడకూడదు మాస్టారూ!'

అధికారి సూచించాడు.

'ఏమైనా చేయాలి మీరు'

'పైకి రాస్తాను!'

రవి లేచాడు.